

సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యు) నేతలు

సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలు పోరాడాలి

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలు హక్కుల కోసం సమరశీల పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి అంగడి పుష్ప పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ(యు) ఓంకార్ భవన్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకురాలు జి.శివానీ, మార్టిన్, రవీందర్‌గౌడ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బండి సంజయ్ అసత్య ప్రచారం

● టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశాలలో ఉన్న నల్ల ధనాన్ని తీసుకొచ్చి పేదల అకౌంట్‌లో రూ. 15 లక్షలు వేస్తామని మోసం చేసిన బీజేపీకి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయొద్దని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే హుస్సేన్‌సాగర్‌లో వేసినట్లేనని ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం అని అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతంపేరుతో ప్రజలలో విద్వేషాలు రెచ్చగొడుతూ ఓట్లు దండుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మెజారిటీ ఎంపీ స్థానాలు గెలుచుకుంటుందని, కరీంనగర్‌లో బండి సంజయ్ ఓటమి ఖాయమన్నారు.

పోగుల రాజేశంను బేషరతుగా విడుదల చేయాలి

● ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల సంఘం వరంగల్ జిల్లా కోశాధికారి పోగుల రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. రాజేశంపై ఛత్తీస్‌గఢ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్, ఉపా చట్టాన్ని ప్రయోగించడం తగదన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేశం కుటుంబ సభ్యులతో కలిసి హరగోపాల్ మాట్లాడారు. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన రాజేశంను ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి తీసుకెళ్లడం చట్ట వ్యతిరేకమన్నారు. రాజేశం భార్య మల్లేశం మాట్లాడుతూ.. ఇంటికి వచ్చి దొంగలుగా తన భర్తను పోలీసులు తీసుకెళ్లారని, ఇదేమిటని అడిగితే తనను నెట్టేశారని వాపోయారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి కుమారస్వామి, పోగుల రాజేశం కుమారుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనమూర్తి

ప్రజ్ఞానిధి వేటూరి ప్రభాకరశాస్త్రి

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంస్కృతాంధ్ర భాషా పండితుడు వేటూరి ప్రభాకరశాస్త్రి అని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శతాబ్దిపూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా ఆదివారం వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. సంస్కృతంలో విశేష పాండిత్యంగల వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రామాణికమైన తెలుగు భాషావేత్త అని అన్నారు. అన్నమయ్య కీర్తనలు వ్యాఖ్యసహితంగా పరిష్కృతం చేసిన ప్రజ్ఞానిధి అన్నారు. గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ ద్రావిడ, గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరండి

● ఎడ్ల హరిబాబుయాదవ్‌తో బొంతు రామ్మోహన్ చర్చలు



ఎడ్ల హరిబాబును సన్మానిస్తున్న బొంతు రామ్మోహన్

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరాలని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్‌ను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కోరినట్లు తెలిసింది. రామ్మోహన్ ఆదివారం హరిబాబు ఇంటికి వెళ్లి గంటసేపు చర్చలు జరిపారు. మీలాంటి సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హరిబాబుయాదవ్‌కు ఆయన సూచించినట్లు సమాచారం. హరిబాబును రామ్మోహన్ కలవడం ముషీరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది. హరిబాబు యాదవ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. బొంతు రామ్మోహన్ తమ ఇంటికి వచ్చారని, కాంగ్రెస్‌లో చేరమని కోరారని తెలిపారు. తాను హామీ ఇవ్వలేదని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే..

సమాజంలో గుర్తింపు

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్ ఆధ్వర్యంలో హరిబాబు యాదవ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు ఘనంగా సన్మానించారు. హరిబాబు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మాజీ అధ్యక్షుడు భీమర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను

పటిష్ఠంగా అమలు చేయాలి

● కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలను పటిష్ఠంగా అమలు చేస్తేనే మహిళలపై దాడుల నివారణ సాధ్యమవుతుందని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, మహిళా జైల్ జైలర్ ఎం.జ్యోతి అన్నారు. ఆదివారం కాచిగూడలో జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను జ్ఞాపికలు, శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాచిగూడ ఎస్ఐ మేఘన, హైకోర్టు న్యాయవాది స్నేహ, దంత వైద్యురాలు డాక్టర్ తార, జీవీఆర్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ అమృతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న మహిళలతో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రామకృష్ణనగర్ కమ్యూనిటీహాల్‌లో మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నారీ న్యాయ సమ్మేళనం - సమారోహం, మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె కేక్ కట్ చేసి పలు రంగాలకు చెందిన మహిళలు, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దేవయాని, ప్రధాన కార్యదర్శి షైనాజ్ బేగం, బ్లాక్ అధ్యక్షురాలు ప్రసన్న, డివిజన్ అధ్యక్షురాలు సంగీత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సాధికారిత

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సాధికారిత సాధ్యమని మున్నూరుకాపు వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్రావ్ అన్నారు. ఆదివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్నూరుకాపు మహిళా విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపు మహిళా సంఘం తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. ట్రస్ట్ బోర్డు మున్నూరుకాపు మహిళల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ట్రస్టీ పిల్లి శ్రీనివాసరావు, మున్నూరుకాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శ్యామకూరి సుజాత, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు సన్మానం

అంబర్‌పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఆశావర్కర్ల పాత్ర కీలకమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. అంబర్‌పేట పటేల్‌నగర్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లను శాలువాలతో సన్మానించారు.

గోల్నాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పురన్ శాంతిశిల హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం రాత్రి మహిళా దినోత్సవం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు కాలేరు పద్మా వెంకటేష్, గరిగంటి శ్రీదేవి రమేష్ పాల్గొని పలువురు మహిళలను సన్మానించారు. శాంతమ్మ అనే నిరుపేద మహిళను కూడా సన్మానించి ఆమెకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో శివకుమారి, లంక సీత, శిరీష, రజనీ, సరస్వతి, సరళ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ



ఇందిరాపార్కులో వాకర్స్‌ను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ఎ. సుధాకర్ యాదవ్



సన్మానం పొందిన ఆశా వర్కర్లతో ఆనంద్‌గౌడ్

'బీసీల సంక్షేమానికి ప్రధాని మోదీ పెద్దపీట'

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ పెద్దపీట వేశారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో సామాజిక సమ్మేళన సభ ముషీరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమన్నారు. బీసీల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కుల సంఘాలకు వివరించాలని సూచించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్ ముదిరాజ్, జమాల్‌పురి నందు, రాష్ట్ర నాయకుడు ఆర్. విశ్వం, ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, బీజేపీ బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీల సంక్షేమానికి కేంద్రం పథకాల అమలు

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఓబీసీ మోర్చా గాంధీనగర్ డివిజన్ సామాజిక సమ్మేళనం ఆదివారం సాయంత్రం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ముషీరాబాద్ అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఎం. ఉమేష్, ఓబీసీ మోర్చా గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో

ఉన్నతాధికారుల లోపభూయిష్ట చర్యలు : ఆర్. కృష్ణయ్య

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో ఉన్నతాధికారుల లోపభూయిష్టమైన చర్యల వల్ల 4 వేల మంది నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో వందలాదిగా తరలివచ్చిన గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల ఖాళీలను అవరోహణ క్రమంలో పూర్తిచేయకుండా ఉన్నతాధికారులు బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలే విధంగా భర్తీ ప్రక్రియ కొనసాగిస్తున్నారని అన్నారు. జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేయకుండా నియామకాలు చేపట్టడంపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, పీఈటీ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు సైదులుగౌడ్, నాయకులు కృష్ణ యాదవ్, అనంతయ్య, మహేందర్, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు జంగయ్య

కవాడిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన చిక్కులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విస్తృత కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం దోమలగూడ గగన్‌మహల్‌లోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయనతోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏ విడుదల చేయాలని కోరారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ సమస్య పరిష్కరించి వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో జూనియర్ రికార్డ్, అసిస్టెంట్స్‌ను నియమించాలని, పాఠశాల శుభ్రతకై పారిశుధ్య కార్మికులను నియమించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే, ఉద్యోగులతో సమానంగా సెలవులు వర్తింప చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు, చావ దుర్గాభవానీ, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కుటుంబ సంక్షేమ నిధి రాష్ట్ర కార్యదర్శి ఎం. రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె. సోమశేఖర్, ఎం. వెంకటి, వి శాంతికుమారి, గాలయ్య, ఎస్. మల్లారెడ్డి, సత్యానంద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

'డబుల్' సముదాయాల్లో

మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలకు కరెంట్, నీటి సరఫరా, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల్లో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకుండానే లాటరీ తీసి ఇళ్లు, పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. సమావేశంలో డబుల్ బెడ్ రూం ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, హైదరాబాద్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బూత్‌స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యక్రమాలు'

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయిలో బీజేపీ బలోపేతానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 12న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో అమిత్ షా పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్‌నాథ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

అరుంధతినగర్ సంక్షేమ సంఘం

అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్



చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ సంక్షేమసంఘం అధ్యక్షుడిగా మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఐదోసారి గెలుపొందారు. ఆదివారం ఉదయం 8.30నుంచి సాయంత్రం 4.30 వరకు బస్తీ కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ జరిగింది. 295 ఓట్లు పోలయ్యాయి.మెరుగు శ్రీనివాస్ యాదవ్‌కు 230 ఓట్లు రాగా ప్రత్యర్థి సరస్వతికి 62 ఓట్లు పడ్డాయి. మూడు ఓట్లు చెల్లలేదు. 168 ఓట్లతో శ్రీనివాస్‌యాదవ్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతు, డ్రైనేజీ వ్యవస్థ పటిష్ఠం చేయడం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్‌పై హర్షం

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల బీఎంఎస్ అనుబంధ సంస్థ టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హర్షం ప్రకటించింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో శ్రమశక్తి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీఎంఎస్ సంఘటన మంత్రి రామ్మోహన్ జీ, ప్రధానకార్యదర్శి ఎర్ర స్వామి, మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు రావాల్సిన ఆర్‌పీఎస్-2017 అరియర్స్, డీఏ అరియర్స్ జూన్‌లో చెల్లించాలని కోరారు. సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రావు కులకర్ణి, జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్. వెంకట్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌కుమార్, కార్యవర్గసభ్యులు ఎ. మాణిక్యం, నేముల ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రూప్స్ ఖాళీలను పెంచాలి

● నిరుద్యోగుల నిరాహారదీక్ష



నిరాహారదీక్ష చేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 2, 3 ఉద్యోగ ఖాళీల సంఖ్యను పెంచి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. నిరాహారదీక్ష చేస్తున్న అశోక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లతో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. గ్రూప్-1.. 750, గ్రూప్-2.. 3 వేల ఖాళీలున్నాయని, వాటికి పరీక్షలు నిర్వహించాలన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పిన ప్రభుత్వం.. టెట్ పరీక్ష నిర్వహించకుండా డీఎస్సీ పరీక్ష ఎలా నిర్వహిస్తుందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు అన్యాయం చేసే జీవో 46ను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆత్మరక్షణకు కరాటేలో శిక్షణ పొందాలి

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందాలని కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విఠల్‌జోషి తెలిపారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటక సాహిత్య మందిర్‌లో కరాటే పోటీలు నిర్వహించారు. కరాటే బెల్ట్‌లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెల్త్‌లీగ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్, కరాటే కోచ్ దామోదర్ నాయక్‌ల కర్ణాటక సాహిత్య మందిర్ కార్యదర్శి నర్సింహమూర్తి, ఉపాధ్యక్షుడు రాఘవేంద్రదేశాయి, కరాటే ఇన్‌స్ట్రక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీతో గిరిజన అభ్యర్థులకు అన్యాయం'

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో షెడ్యూల్ ఏరియా ప్రాంతంలోని గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆరోపించారు. జనరల్ డీఎస్సీ, ఏజెన్సీ డీఎస్సీలను వేర్వేరుగా ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే గిరిజన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరించి ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరిగితే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

మద్దాలి ఉషా గాయత్రికి సన్మానం

నల్లకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న ప్రముఖ కూచిపూడి నర్తకి మద్దాలి ఉషా గాయత్రిని సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మ, కూచిపూడి నర్తకి వాసతి తదితరులు ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో సంగీత అధ్యాపకులు తేజస్విని, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్

నల్లకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ అన్నారు. ఆదివారం ఆయనను కేరళ రాష్ట్రానికి చెందిన ఎస్కాన్ ఎన్జీవో సంస్థ చైర్మన్ రహీం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ, ఏపీ తదితర రాష్ట్రాల్లో పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు రహీం తెలిపారు. వాహనాల రాకపోకలతో పెరిగిపోతున్న కర్బన ఉద్గారాల(కాలుష్యం) తగ్గింపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్కాన్ సంస్థ నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని కృష్ణాయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్కాన్ సంస్థ వైస్ చైర్మన్ బొబ్బిలి రాజుయాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

● కార్పొరేటర్ ఉమాదేవి



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చప్పల్‌బజార్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను సత్వరమే పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. ఆదివారం చప్పల్ బజార్‌లో పాదయాత్ర నిర్వహించి డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జలమండలి అధికారుల నిర్లక్ష్యం వల్లనే పనులు ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. పనుల్లో వేగం పెంచాలని కోరారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మున్నూరుకాపులను బీసీ-ఏలో చేర్చాలి

చిక్కడపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీసీ-డిలో ఉన్న మున్నూరు కాపులను బీసీ-ఏ గ్రూప్‌లో చేర్చాలని కాపు యువజన సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం, ప్రధానకార్యదర్శి మహేందర్, తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు వనమల ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతు పండించిన ధాన్యం నిల్వ చేయడానికి ప్రతి మండల కేంద్రంలో గోదాములు ఏర్పాటు చేయాలన్నారు.



అమావాస్యను పురస్కరించుకొని రాంనగర్ చౌరస్తాలో పేదలకు అన్నదానం చేసున్న వాసవీ సేవా సమితి సభ్యులు



అయోధ్యలో బాలరాముడిని దర్శించుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి